సాక్షి
హనుమకొండ

శుక్రవారం | 14 | జూలై | 2023



అకడమిక్ మార్కులున్నా అంతే..

వరంగల్ జిల్లా సంక్షేమశాఖలో పలు పోస్టుల భర్తీలో గందరగోళం నెలకొంది. అకడమిక్ మార్కులు ఉన్నా ఉద్యోగం రాని పరిస్థితి నెలకొంది. - IIలో▸



పోలీసుల భద్రతే ప్రభుత్వ ధ్యేయం

పోలీసుల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని టీఎస్ఎస్పీ బెటాలియన్ ప్రత్యేక డీఐజీ షర్ఫోద్దీన్ సిద్ధిఖీ అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
$34^0/25^0$

వాతావరణం

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌నందు 5వ తరగతిలో ప్రవేశాలకు హనుమకొండలోని జేఎన్ఎస్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించిన ఎంపిక ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఈపోటీలకు జిల్లా నుంచి సుమారు 70 మంది బాలబాలికలు హాజరైనట్లు డీవైఎస్ఓ అశోక్‌కుమార్ తెలిపారు. 20 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 27న హకీంపేటలో నిర్వహించే తుది ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ కె.అనిల్, డీఎస్ఏ కోచ్‌లు శ్రీమాన్, నవీన్‌కుమార్, శంకర్, అఫ్జల్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 14న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వరంగల్–2 డిపో మేనేజర్ జి.సురేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు వరంగల్–2 డిపో నుంచి ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ములుగు, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, వెంకటాపూర్ రూట్‌లోని ప్రయాణికులు 99592 26048 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

నిట్‌లో బీఎస్సీ–బీఈడీ కోర్సు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికిగాను నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్, డ్యూయల్ మేజర్ ప్రోగ్రామ్ బీఎస్సీ–బీఈడీ కోర్సును ప్రారంభిస్తున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)–2020కి అనుగుణంగా నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) సౌజన్యంతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ విభాగాలతో డ్యూయల్ మేజర్ ప్రోగ్రామ్ బీఎస్సీ–బీఈడీని అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ–బీఈడీ కోర్సులో చేరేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పూర్తి వివరాలకు www.nta.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణలో ఉన్న పెద్ద కోవెల స్థలం స్వాధీనం



హన్మకొండ చౌరస్తా: ఆక్రమణలో ఉన్న హనుమకొండ రాగన్నదర్వాజ ప్రాంతంలోని శ్రీరంగనాయకస్వామి దేవస్థానం (పెద్ద కోవెల) స్థలాన్ని గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. పెద్దమ్మగడ్డ సమీపం అక్షర కాలనీలోని సర్వే నంబర్లు 552, 807లోని 2.18, 1.22 ఎకరాల స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు, ప్రహరీ నిర్మించారు. ఈ విషయంపై పలు సంస్థలు గతంలో లోకాయుక్తను ఆశ్రయించాయి. స్పందించిన లోకాయుక్త సర్వే చేసి కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో దేవాదాయ, ల్యాండ్ సర్వే శాఖలు కలిసి సర్వే చేసిన అనంతరం హద్దులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత పర్యవేక్షణలో జరిగిన అధికారులు వెంకటయ్య, రాజేంద్రం, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్, శేషగిరి, ప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, వరంగల్, హనుమకొండ జిల్లాల ఐటీఐ కన్వీనర్ ఎల్.జుమ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశలో దరఖాస్తు చేసుకుని సీటు రాని విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు, తగిన ఆధారాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా టి.గోపి

వరంగల్ క్రైం: హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా టి.గోపిని నియమిస్తూ వరంగల్ సీపీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు రెండు నెలల తర్వాత ఈ పోస్టు భర్తీ అయ్యింది. ఖమ్మం నుంచి కమిషనరేట్‌కు వచ్చిన టి.గోపిని హసన్‌పర్తికి బదిలీ చేశారు.

మండె నుంచి.. మడి దాక..

- వరి సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి
- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి
- స్వల్పకాలిక రకాలతో అధిక దిగుబడులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



కరీమాబాద్ : వానాకాలం ప్రారంభమై దాదాపు నెల రోజులవుతోంది. అయినా ఆశించిన మేర వర్షాలు కురవలేదు. ఇప్పుడిప్పుడే ఓ మోస్తరుగా కురుస్తున్నాయి. దీంతో నిన్న, మొన్నటి వరకు మొక్కజొన్న, పత్తి విత్తనాలు నాటిన అన్నదాతలు.. ప్రస్తుతం వరి సాగుకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా 'వరి' నార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలి. లేకపోతే తెగుళ్లు, చీడపీడలు ఆశించి పంట దిగుబడి తగ్గుతుంది. అలాగే.. మండె పోయడం నుంచి.. మొలక అలకడం వరకు.. నారు మడి నుంచి.. సాగుబడి వరకు.. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడి సాధ్యం. కాగా.. కాలం కొంతమేర ఆలస్యమైన నేపథ్యంలో 'స్వల్ప కాలిక' రకాల పంటలను సాగు చేసి దిగుబడి పెంచుకోవాలని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

స్వల్పకాలిక రకాలతో 'అధిక 'దిగుబడులు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక వరి పంట సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ సోనా, జగిత్యాల సన్నాలు, శీతల్, రామప్ప వంటి 125 రోజుల కాలం పంటలతోపాటు 120 రోజుల రకాలైన ఐఆర్–64, డబ్ల్యూజీఎల్–20471, జేజీఎల్–18047, కేఎన్ఎం–118 రకాలు సాగుచేసుకోవాలి. అంతేకాకుండా ఆర్ఎన్ఆర్–10754(115 రోజులు), డబ్ల్యూజీఎల్–14377, ప్రద్యుమ్న–జేజీఎల్–17004(105 రోజులు) వంటి స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలి. కాగా.. దొడ్డు రకాలైతే ఎకరానికి 25 కిలోలు, సన్న రకాలైతే 20 కిలోల విత్తనం అవసరమవుతుంది.

విత్తనశుద్ధితో మేలు...

పంటలకు చీడపీడలు ఆశిస్తున్న నేపథ్యంలో వాటి నివారణకు రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలి. మెట్ట నారుమడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బన్డిజంను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లాలి. దమ్ము నారుమడులకు అయితే లీటరు నీటికి 1 గ్రాము కార్బన్డిజం కలిపి ద్రావణంలో 24 గంటలు నానబెట్టిన తరువాత మండెకట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

నారుమడిలో నీటి యాజమాన్య పద్ధతులు..

నారుమడిని దున్ని 2–3 సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి ఎత్తు నారుమడులను తయారు చేయాలి. మొలకెత్తిన విత్తనాన్ని చల్లి మొదట్లో(వారం రోజులు) ఆరు తడులు నీరు పెట్టి తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి. ఈ క్రమంలోనే 2 గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు, కిలో చల్లిన తర్వాత 12–14 రోజులకు) కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. నాటు ఆలస్యమయ్యే పరిస్థితులలో రెండో దఫా నత్రజనిని ఆలస్యంగా వేసి నారు ముదరకుండా చూసుకోవాలి.

నారుమడిలో కలుపు నివారణ..

నారుమడిలో కలుపు నివారణకు బుటాక్లోర్, ప్రెటిలాక్లోర్, సేఫనర్ వంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. బిస్పిరిబాక్ సోడియం అనే కలుపుమందును కూడా మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. నారుమడిలో ఊద, ఒలిపిడి వంగి గడ్డి జాతి కలుపు ఉంటే సైహలోఫాస్, పిబ్యుటైల్ అనే మందును మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

నారుమడిలో మార్పులు కనిపిస్తే..

నారు మొలకెత్తిన తర్వాత కొనలు ముదురు గోధుమరంగుకు మారి చనిపోతుంటే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మెట్ట నారుమడిలో ఐరన్ లోపం కనిపిస్తే 2 నుంచి 5 గ్రాముల అన్నభేది, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పు మొక్క వయసును బట్టి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నారుమడిలో చీడపీడల నివారణ..

నారుమడి దశలో కాండం తొలుచు పురుగు ఆశించి లేత నారు కొనలపై గుడ్లు పెట్టి నాటు వేసిన తర్వాత పిల్లపురుగులు బయటకు వచ్చి నష్టం కలిగిస్తాయి. ఈనేపథ్యంలో రైతులు నారు గుంజడానికి 7 రోజుల ముందు గుంట నారుమడికి 400 గ్రాముల కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరుంచాలి. నారు నాటే ముందు వరి నారు కొనలను తుంచడం, కత్తిరించడం చేయాలి.

నారుమడి కీలకం...



వరి సాగులో నారుమడిని కాపాడుకోవడం కీలకం. మండెపోసి మొలక అలికిన తర్వాత నుంచి నారుమడిని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. నారు మొలక రంగు మారడం, ఎండిపోవడం జరుగుతుంటే వెంటనే మందులు పిచికారీ చేయాలి. చీడపీడల నివారణ చర్యలు విత్తనశుద్ధి నుంచే మొదలుపెట్టాలి. స్వల్పకాలిక రకాలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

– డాక్టర్ ఆగుర్ల రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

'కోచ్' చుట్టూ.. కొట్లాట!

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై రాజకీయ రగడ

- రైల్వే వ్యాగన్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన జరిగినా చల్లారని మాటల మంటలు
- కోచ్ ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమిస్తామంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, వామపక్షాలు
- కోచ్ ఫ్యాక్టరీకి వ్యాగన్ తయారు వర్క్‌షాప్‌నకు తేడా లేదంటున్న బీజేపీ



కాజీపేట రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్, వ్యాగన్ తయారీ పరిశ్రమ నమూనా

సాక్షిప్రతినిధి, వరంగల్: ఓరుగల్లు ప్రజల నాలుగు దశాబ్దాల నిరీక్షణ.. ప్రతిష్టాత్మక రైల్వే ప్రాజెక్టు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ.. కానీ ఈ ఫ్యాక్టరీ స్థానంలో రైల్వే వ్యాగన్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఈ నెల 8న ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చి తీరాల్సిందేనని బీఆర్ఎస్, కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేస్తుండగా... మరోవైపు కోచ్ ఫ్యాక్టరీకి.. రైల్వే వ్యాగన్ తయారు యూనిట్‌కు తేడా లేదని బీజేపీ వాదిస్తోంది. ఇంకోవైపు కోచ్ ఫ్యాక్టరీ అసాధ్యమంటున్న రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ రాజకీయ ప్రయోజనాల కోసమే పార్టీల ఆరాటం అంటూ మండిపడుతోంది. ఇదే అంశాన్ని పార్టీలు ఎవరికి అనుకూలంగా వారు ప్రచారాస్త్రంగా మలుచుకునే పనిలో పడ్డారు.

బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ..
మరోవైపు కాంగ్రెస్, వామపక్షాలు..

కాజీపేటకు రైల్వే పరంగా గుర్తింపునిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీని పొందుపర్చారు. కానీ.. రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు పూర్తయినా హామీ మాత్రం కాగితాలకే పరిమితమైంది. దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌ను మంజూరు చేసింది. దానికి కావాల్సిన భూ సేకరణ చేసి ఇవ్వాలని కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం కాజీపేట సమీపంలోని అయోధ్యపురంలో మడికొండ సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన భూమితోపాటు 150 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఆ భూమిలో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ ఏర్పాటుకు గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.160 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ఇదే సమయంలో ఈ నెల 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుమారు రూ.552 కోట్ల ఖర్చుతో రైల్వే వ్యాగన్ల తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌తోపాటు వ్యాగన్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. బుధవారం వ్యాగన్ తయారీ యూనిట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వి.వినోద్‌కుమార్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు పర్యటించి బీజేపీపై విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధ్యం కాదు





నాలుగు దశాబ్దాలుగా ఎన్నికల నినాదంగా, విభజన చట్టంలోని హామీగా మిగిలిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యం కాదు. రంగారెడ్డి జిల్లా కొండకల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్రంలో మరో కోచ్ ఫ్యాక్టరీ వచ్చే అవకాశం లేదు. రాజకీయ పార్టీల నేతలు అవగాహనారాహిత్యంతో ఎన్నికల్లో లబ్ధి పొందడానికే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు.

– నర్సింగరావు, రాఘవేందర్, రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ప్రతినిధులు

కోచ్ ఫ్యాక్టరీ.. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి



కోచ్ ఫ్యాక్టరీ అనేది నాలుగు దశాబ్దాల డిమాండ్.. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ ఇవ్వడం వల్ల తెలంగాణకు అన్యాయమే. న్యాయంగా దక్కాల్సిన హక్కులను బీజేపీ కాలరాస్తోంది. ఎన్నికల వేళ డ్రామాలు చేస్తోంది.

– దాస్యం వినయ్‌భాస్కర్, ప్రభుత్వ చీఫ్‌విప్

ప్రజల ఆకాంక్ష నెరవేర్చేది బీజేపీ ప్రభుత్వమే



బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో మార్పు కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నో ప్రజానుకూల విధానాలను ప్రవేశపెట్టింది. కోచ్ ఫ్యాక్టరీ స్థానంలోనే వ్యాగన్ తయారీ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ పార్టీ, దాని ఏ టీమ్ కాంగ్రెస్ పార్టీ ఓరుగల్లు అభివృద్ధికి చేసింది శూన్యం.

– రావు పద్మ, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు

కాంగ్రెస్ హయాంలోనే..



రైల్వే వ్యాగన్ తయారీ యూనిట్ మంజూరు బీజేపీ గొప్పతనం కాదు. కాంగ్రెస్ పార్టీ 2009లోనే యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసి రూ.18 కోట్లు కేటాయించింది. ఆ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో శంకుస్థాపన జరగలేదు. ఆ రెండు పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే విభజన చట్టంలోని కోచ్ ఫ్యాక్టరీ హామీని నెరవేర్చాలి.

– నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

'కృష్ణవేణి' దొరకడం కష్టమేనా..?

- మూడు నెలలుగా ఆమె సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్
- పాప దత్తత కేసులో పోలీసుల విచారణ
- ఆయా రాణి చెప్పిన నంబర్‌కు పోలీసుల కాల్
- స్విచ్ఛాఫ్ రావడంతో ఆమె పాత్రపై అనుమానాలు
- దీంతో తెరపైకి 'అక్రమ రవాణా ముఠా' వ్యవహారం

సాక్షి, వరంగల్ : ఆమె పేరు కృష్ణవేణి.. ఆ ఒక్కటే కాదు ఆమెను వివిధ పేర్లతో పిలుస్తుంటారట.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్‌లోని ఏడు నెలల పాప అక్రమ దత్తత కేసు విచారణలో తెరపైకి వచ్చిన ఈమె నంబర్ మూడు నెలల నుంచి స్విచ్ఛాఫ్ ఉంది. దీంతో అక్రమ రవాణా ముఠా పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆ ఏడు నెలల పాపను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. ఆమె తల్లిదండ్రులు ఎవరు? ఎన్ని చేతులు మారి వరంగల్‌లోని రషీదాభాను భోజని దంపతుల వద్దకు చేరిందనేది అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. వరంగల్ పోలీసులు క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే ఆ పాప తల్లిదండ్రుల ఆచూకీ తెలుస్తుంది. లేదంటే ఆ పాప అనాథగా మిగులనుంది.

కావాలనే మార్చేసిందా?

మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పనిచేసే రాణినే తమకు ఆ బిడ్డను ఇచ్చిందని భోజని దంపతులు చెప్పడంతో ఆ దిశగా మట్టెవాడ పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే రాణితో పోలీసులు మాట్లాడడంతో మంచిర్యాలకు చెందిన కృష్ణవేణి ఆ పాపను ఇచ్చిందని చెప్పింది. ఈ మేరకు ఆమె సెల్‌ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. మూడు నెలలుగా ఆమె ఫోన్ పనిచేయడం లేదని పోలీసుల విచారణలో తేలింది. అయితే, ఆమెను కృష్ణవేణి అని కాకుండా వివిధ పేర్లతో పిలుస్తుంటారని ఆయా రాణి చెప్పడంతో.. ఈమె మనుషుల అక్రమ రవాణా ముఠాలోని సభ్యురాలై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. లేదంటే పిల్లలను కిడ్నాప్ చేసి అవసరమైన వారికి అమ్ముతుందా.. అనామకుల నుంచి బిడ్డలను తక్కువ ధరకు కొని రూ.లక్షల్లో విక్రయిస్తుందా? అన్నది ఆమె పట్టుబడితేనే తెలియనుంది. ఏదేమైనా ఆమెను వివిధ పేర్లతో పిలుస్తారన్న విషయాన్ని గమనిస్తే సినిమాల్లో చూపించే మాదిరిగా ఏదైనా ముఠా ఈ పాప విక్రయం వెనుక ఉండొచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కేసును వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. దీని వెనుక ఎవరున్నారనేది త్వరలోనే తేల్చే దిశగా పోలీసులు పనిచేస్తున్నారు. కాగా.. ఇప్పటికే ఈ అక్రమ దత్తత వ్యవహారంలో పాపను తీసుకుని అమెరికాలో స్థిరపడిన కొంపల్లి వాసి కరీమ్‌విరాణి, అతడి భార్య అమెరికా సిటిజన్ అశామావిరాణితో పాటు భోజని దంపతులపై జేజే యాక్ట్ 81 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఏడు నెలల పాపను హనుమకొండలోని శిశు విహార్‌లో సంరక్షిస్తున్నారు.

నీటి సరఫరాలో లోపాలు అధిగమించండి



ఎల్‌బీనగర్‌లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న మేయర్, సమస్యను వివరిస్తున్న స్థానికులు

వరంగల్ అర్బన్: తాగునీటి సరఫరాలో లోపాలు అధిగమించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో నీటి సరఫరాపై సమీక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. దేశాయిపేట ఫిల్టర్, కరీమాబాద్, అండర్ రైల్వేజోన్ ప్రాంతాల్లో నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ సారంగం తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పూర్తి చేయండి

నాలాలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని మేయర్ సుధారాణి ఆదేశించారు. గురువారం కాశిబుగ్గ, ఎల్‌బీనగర్‌లోని పలు కాలనీల్లో క్షేత్రస్థాయిలో పూడికతీత, అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లో క్రిస్టల్ గార్డెన్ ప్రాంతంలో సాధారణ నిధులు రూ.60 లక్షల వ్యయంతో కొనసాగుతున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. కాశిబుగ్గ జంక్షన్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు కొనసాగుతున్న డీ–సిల్టింగ్ పనులను మేయర్ పరిశీలించి వేగంగా పూర్తి చేయాలన్నారు. లోతుకుంట ముంపు ప్రాంతాల్లో పర్యటించిన క్రమంలో వర్షాకాలం నేపథ్యంలో.. తమ ఇళ్లలోకి వరద వస్తోందని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ముంపునకు గురవకుండా చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. తనిఖీల్లో కార్పొరేటర్ ఫుర్ఖాన్, బీఆర్ఎస్ నాయకులు గోరంట్ల రాజు, ఎండీ యాకుబ్ పాషా, ఎండీ అజాం, ఎండీ సాధిక్, షఫీ, ఖదీర్, అలీం, నాగరాజు, మొగిలి, సారంగపాణి, బల్దియా ఈఈ.శ్రీనివాస్, డీఈ సారంగం, ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీ

కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తూ ప్రోత్సహిస్తోందని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. హనుమకొండ జిల్లాకు కేటాయించిన ఆయిల్‌పామ్ కంపెనీ కేఎన్ బయో సైన్సెస్ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌లో పెంచుతున్న నర్సరీని గురువారం కలెక్టర్ పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, రాయితీ, రైతుల వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తిమ్మాపూర్‌లో 10 ఎకరాల్లో, సెంట్రల్ జైలు ఆవరణలో 21 ఎకరాల్లో నర్సరీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీటిలో మొక్కలను పెంచడానికి అవసరమైన విత్తనాలను కోస్టారికా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. మొక్కలను మొదట షేడ్ నెట్ కింద నాలుగు నెలలు పెంచి, ఆ తర్వాత సెకండరీ నర్సరీలో 8 నెలలు పెంచి, ఆ ఎదిగిన మొక్కలను రైతులకు రాయితీపై సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ రెండు నర్సరీల్లో కలిపి 3 లక్షల 75 వేల మొక్కలు పెంచుతున్నట్లు వివరించారు. రైతులకు ఎకరానికి మొక్కలపై రాయితీ రూ.11,000, తోట యాజమాన్యం, ఎరువులకు రూ.2,100, అంతర పంటలకు రూ.2,100, బిందు సేద్యం ఎకరానికి రూ.15,000 నుంచి రూ.16,000 వరకు ఇస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత రెండు, మూడు, నాలుగు సంవత్సరాలు ఎకరానికి రూ.4,200 చొప్పున రాయితీ ఇస్తారని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లా లక్ష్యం 5,900 ఎకరాలు కాగా.. ఇందులో కేఎన్ బయో సైన్సెస్ వారి లక్ష్యం 3,500 ఎకరాలు, రామ్ చరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ వారి లక్ష్యం 2,400 ఎకరాలని తెలిపారు. ఇప్పటివరకు 630 ఎకరాలు మంజూరు చేసి మొక్కలు సరఫరా చేయగా రైతులు నాటుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఆర్.శ్రీనివాస్ రావు, ఉద్యానవన అధికారులు ఎస్.శంకర్, బి.మానస, కేఎన్ బయో సైన్సెస్ కంపెనీ ప్రతినిధులు పీవీ కుశాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

వరంగల్ : వరంగల్ జిల్లా పరిషత్ పరిధిలోని అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన గురువారం స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. రెండో స్థాయీ సంఘం సమావేశంలో పేదరిక నిర్మూలన, ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి, సహకార, ఎక్సైజ్, పొదుపు, కుటీర, గ్రామీణ, లఘు పరిశ్రమలపై సమీక్షించారు. ఒకటో స్థాయీ సంఘం సమావేశంలో జిల్లా ప్రణాళిక, ఆర్థిక పరమైన అంశాలపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలతో కలిసి అమలు తీరుతెన్నులపై సమీక్షించారు. స్థాయీసంఘాల సమావేశాలకు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గైర్హాజరయ్యారు.

హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం హరితహారం, మన ఊరు–మన బడి కార్యక్రమాలు, డీవార్మింగ్ డేపై సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీపీఓ కల్పన, డీఈఓ వాసంతి, డీడబ్ల్యూఓ శారద, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఇమ్యూనైజేషన్ అధికారి చల్లా మధుసూదన్, నర్సంపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు గోపాల్ రావు, ప్రకాశ్ పాల్గొన్నారు. అదేవిధంగా బీసీ కుల వృత్తులకు అందించే రూ.లక్ష సాయంపై మంత్రి గంగుల కమలాకర్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

రైతు బీమాలో మార్పులు, చేర్పులకు అవకాశం

హన్మకొండ: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు, పోడు రైతులకు ప్రభుత్వం రైతు బీమాకు అవకాశం కల్పించింది. ఈరైతులు ఆగస్టు 18లోపు వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయాధికారులకు కావాల్సిన వివరాలు అందించాలి. 1964 ఆగస్టు 14 నుంచి 2005 ఆగస్టు 14లోపు జన్మించి రైతులను బీమాకు అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. గతంలో బీమా చేసుకున్న రైతులకు ప్రభుత్వం రెన్యూవల్ చేస్తుంది. నామినీని మార్చడం, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. మార్పులు, చేర్పులకు ఈనెల 30లోపు వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయ అధికారులను కలిసి రైతులు వివరాలు అందించాలి. అధికారులు వీటిని పరిశీలించి సంబంధిత వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తారు. రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

102లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్/కాశిబుగ్గ: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈఎంఆర్ఎస్ఐ 102 సంస్థలో కెప్టెన్ (డ్రైవర్) ఉద్యోగాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై, 23 నుంచి 35లోపు వయసు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి కనీసం మూడు సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఎస్సెస్సీ మెమో, బయోడేటా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 15వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9100799258 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్యూ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు



క్యూ పద్ధతిలో కూర్చున్న భూక్రయవిక్రయదారులు

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం నుంచి క్యూ పద్ధతిలో రిజిస్ట్రేషన్లను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ కార్యాలయంలో 130 నుంచి 150 వరకు దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడంతో ఖజానాకు రూ.80 లక్షల నుంచి రూ. కోటీ ఆదాయం సమకూరుతుంది. ఒక్క దస్తావేజుకు భూక్రయవిక్రయదారులతోపాటు ఇద్దరు జామీనుదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తుంటారు. భూక్రయవిక్రయదారులే కాక డాక్యుమెంట్ రైటర్లు యథేచ్ఛగా కార్యాలయంలో తిరుగుతుండడంతో సబ్ రిజిస్ట్రార్ టేబుల్ వద్ద రద్దీ ఉండడంతో క్యూ పద్ధతి పాటించాలని కార్యాలయంలో గురువారం ప్రత్యేకంగా కుర్చీలను ఏర్పాటు చేశారు. దీంతో భూక్రయవిక్రయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడవి పంది దాడి.. ఇద్దరికి గాయాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: అడవి పంది దాడిలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం మండలంలోని కామారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పబ్బోజు నర్సింహాచారి, మైపతి అరవింద్ సాయంత్రం పొలం వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో చెట్ల పొదల్లో ఉన్న అడవి పంది వారిపై దాడికి పాల్పడింది. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడగా వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అకడమిక్ మార్కులున్నా అంతే!

సంక్షేమ శాఖ పోస్టుల భర్తీలో గందరగోళం

- అనుభవం, ఇంటర్వ్యూ మార్కుల్లో భారీ తేడా
- రెండింట్లో ఓకే ఉన్నా.. మరో రెండింట్లో దారుణం
- ఒకరు అంగన్‌వాడీ టీచర్ కోడలు కావడంతో ప్రాధాన్యం
- ఇంకొకరు అదే విభాగంలోని అకౌంటెంట్ భార్య..
- అనుభవ సర్టిఫికెట్లు లోతుగా పరిశీలిస్తే వెలుగుచూడనున్న అక్రమాలు
- కలెక్టర్ అధ్యక్షతన కమిటీని తప్పుదారి పట్టించారన్న విమర్శలు



వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారికి కార్యాలయం

సాక్షి, వరంగల్/కాశోజీ సెంటర్: వరంగల్ జిల్లా సంక్షేమ శాఖలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అర్హులకు అన్యాయం జరుగుతుందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అకడమిక్ మార్కుల్లో మంచి స్కోరు సాధించిన అభ్యర్థులకు అనుభవం, ఇంటర్వ్యూ వచ్చేసరికి తక్కువ మార్కులు రావడంతో ఈ నియామకాలపై గందరగోళం నెలకొంది. ఇంతకీ విషయమేంటంటే కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి కాంట్రాక్ట్ బేసిస్‌కు చెందిన నాలుగు ఉద్యోగాల నియామకాలు ఇటీవల చేపట్టారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్, టెండర్ స్పెషలిస్ట్, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ, ఎంటీఎస్ పోస్టులకు 199 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో రెండు పోస్టులకు అర్హులను ఎంపిక చేయగా.. మరో రెండు పోస్టుల్లో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొందన్న వాదన బలంగా ఉంది. ఎందుకంటే ఈ పోస్టులకు ఎంపికైన ఇద్దరిలో ఒకరు అంగన్‌వాడీ టీచర్ కోడలు కాగా, ఇంకొకరు జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేస్తున్న అకౌంటెంట్ భార్య ఉండడం అనుమానాలకు తావిస్తోంది. వీరికి అకడమిక్‌లో తక్కువ మార్కులున్నా .. అనుభవం, ఇంటర్వ్యూలో ఇష్టారీతిన మార్కులేయడం విమర్శలకు అస్కారమిచ్చినట్లయ్యింది. టెండర్ స్పెషలిస్ట్ పోస్టు దక్కించుకున్న యువతికి అకడమిక్ మార్కులు 38.84 ఉండగా.. అనుభవంలో 30, ఇంటర్వ్యూలో 7.75 మార్కులు వచ్చాయి. ఈమె తర్వాత స్థానంలో ఉన్న యువతికి అకడమిక్ మార్కులు 48.90 ఉండగా.. అనుభవంలో 23, ఇంటర్వ్యూలో సున్నా మార్కులు రావడం గమనార్హం. ఇక స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ పోస్టు దక్కించుకున్న యువతికి అకడమిక్ మార్కులు 40.41 ఉండగా.. అనుభవం 29 మార్కులు, ఇంటర్వ్యూ ఏడు మార్కులు వచ్చాయి. ఈమె తర్వాతి స్థానంలో ఉన్న యువతికి అకడమిక్ మార్కులు 45.12 ఉంటే అనుభవం 25 మార్కులు, ఇంటర్వ్యూ ఏడు మార్కులు వచ్చాయి. ఈమెతోపాటు మరో ముగ్గురికి పోస్టు దక్కించుకున్న యువతి కన్నా అకడమిక్ మార్కులు ఎక్కువగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ఇంకో విషయమేంటంటే వారు పనిచేసిన సంస్థల్లో నిజంగా పనిచేశారా లేదా అని తెలుసుకోకుండానే ఈ నియామకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ ఇద్దరే చెప్పిందే ఫైనలట..

జిల్లా సంక్షేమ విభాగ ప్రధాన కార్యాలయంలో ఉండే ఓ వ్యక్తితోపాటు జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేసే ఓ అధికారి ఉద్యోగాల నియామకాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలున్నాయి. మేం ఏది చెబితే అదే ఫైనల్.. వారికే ఉద్యోగాలు వస్తాయని వారు బల్లగుద్దీ మరీ చెబుతుండడం గమనార్హం. ఇప్పటికే డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో ఓ పోస్టును తానే ఇప్పించానని చెబుతున్న ఓ అధికారి.. ఇప్పుడూ చైల్డ్‌లైన్‌లోనూ తమవారికే పోస్టులు వస్తాయని చెబుతుండడంతో ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు ఆస్కారం ఉందనే విమర్శలకు అవకాశమిస్తోంది. ఇప్పటికే చైల్డ్‌లైన్‌లో పనిచేస్తున్న ప్రస్తుత సిబ్బందికి అవకాశమిచ్చాకే.. కొత్తవాళ్లలో అర్హులకు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి నిబంధనలు ఉన్నా అవన్నీ పట్టించుకోవడం లేదు. ఎంతటి ప్రతిభ ఉన్నా వారి నైనా పక్కన పెట్టేస్తామని చెబుతుండడంతో అక్రమాలు జరిగే అవకాశ ముందని చర్చ జరుగుతోంది. అయితే, కలెక్టర్ అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో కమిటీ ఈ అభ్యర్థులను ఖరారు చేసిందని చెబుతున్నా.. కమిటీని తప్పుదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. ఈ నియామకాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఆమె ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ విభాగాధికారి శారద వివరణ ఇచ్చారు.

న్యాయం చేయాలి..

- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



యాదగిరి (ఫైల్)

సంగెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఈ ఘటనపై తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబీకులు మృతదేహంతో ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. సంగెం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నంగునూరి యాదగిరి(57)ని గత జూన్ 29న నర్సానగర్ గ్రామానికి చెందిన బెజ్జాల పెద్ద వెంకటేశ్వర్లు కూలీ పనికి తీసుకెళ్లాడు. పని ముగిసిన అనంతరం ద్విచక్రవాహనంపై పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఏనుగల్లు గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడగా వెనుక కూర్చున్న యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే యాదగిరిని ఎంజీఎం తరలించి పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో వెంకటేశ్వర్లుపై ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లు, అతడి కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పరారీలో ఉన్నారు. చికిత్స పొందుతున్న యాదగిరి గురువారం మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు, బంధువులు యాదగిరి మృతదేహాన్ని వెంకటేశ్వర్లు ఇంటి ఎదుట వేసి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సంగెం, పర్వతగిరి ఎస్సైలు భరత్, దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులకు నచ్చజెప్పి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని యాదగిరి స్వగ్రామం తిమ్మాపూర్‌కు తరలించారు.



మృతుడి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎస్సైలు

ఆర్వో, ఏఆర్వోల నియామకం

హన్మకొండ అర్బన్: రానున్న శాసన సభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణలో కీలకమైన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీఓలు, సబ్‌కలెక్టర్లను నియమించేవారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్లను కూడా ఆర్ఓలగా నియమించారు. ఉమ్మడి జిల్లాలో జనగామ నియోజకవర్గ ఆర్వోగా అక్కడి ఆర్డీఓ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్ఓగా అక్కడి ఆర్డీఓ, పాలకుర్తి ఆర్వోగా జనగామ జిల్లా అదనపు కలెక్టర్, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల ఆర్వోలుగా అక్కడి ఆర్డీఓలను నియమించారు. వరంగల్ పశ్చిమ ఆర్వోగా హనుమకొండ ఆర్డీఓ, వరంగల్ తూర్పు ఆర్వోగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్, వర్ధన్నపేట ఆర్వోగా వరంగల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, భూపాలపల్లి ఆర్వోగా అక్కడి ఆర్డీవో, ములుగు ఆర్వోగా ఏటూరునాగారం ఐటీడీఏ పీఓను నియమించింది. అదే విధంగా ప్రతి నియోజకవర్గంలోని తహసీల్దార్లు సహాయ రిటర్నింగ్ అధికారులు వ్యవహరిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

పోలీసుల భద్రతే ప్రభుత్వ ధ్యేయం

- టీఎస్ఎస్పీ బెటాలియన్ ప్రత్యేక డీజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ



యూనిట్ ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న టీఎస్ఎస్పీ ప్రత్యేక డీజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ

మామునూరు: పోలీసుల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని టీఎస్ఎస్పీ బెటాలియన్ ప్రత్యేక డీజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ యూనిట్ ఆస్పత్రిని 5వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ పెద్ద బాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు వినియోగించుకుంటున్న సేవలు, అందుబాటులో ఉన్న పరీక్ష యంత్రాల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది రాష్ట్ర భద్రతతోపాటు ప్రజల రక్షణ కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ఎక్కడ ఏ విపత్తు వచ్చినా స్పెషల్‌పోలీసులు సిద్ధంగా ఉండాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పోలీసు సిబ్బందికి నాణ్యమైన మందులతోపాటు అత్యాధునిక రోగ నిర్ధారణ పరీక్ష యంత్రాలు, రవాణా కోసం ఆధునిక వాహనాలను సమకూర్చిందన్నారు. ఈ వనరులను సిబ్బంది సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీ సోమని, ఆర్ఐలు కార్తీక్, శ్రీనివాసులు, సోలమన్ రాజు, డాక్టర్ విజయ్‌కుమార్, ఫార్మసిస్ట్ జలగం రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కాశోజీ సెంటర్ : ఉపాధ్యాయులు విద్యార్థుల్లో కళా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు అందుకు సంబంధించిన విషయ జ్ఞానాన్ని కూడా బోధించాలని డీఈఓ వాసంతి అన్నారు. నగరంలోని శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం జిల్లాస్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం ఏర్పాటు చేసి సమావేశంలో డీఈఓ వాసంతి మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలు పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.శారదాబాయి, ఉపాధ్యాయులు ఆడెపు రవీందర్, జగదీశ్వరి, ఎస్.కృష్ణమూర్తి, కొక్కుల శ్రీధర్ పాల్గొన్నారు.

కార్మికుల గౌరవ వేతనం పెంచాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

కాశోజీ సెంటర్ : మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనాన్ని వెంటనే పెంచాలని, అలాగే కార్మికుల పెండింగ్ బిల్లుల చెల్లించాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ సభ్యత్వంలో భాగంగా గురువారం ఆయన ఖిలావరంగల్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. డీటీఎఫ్ రాష్ట్ర విద్యా, విజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.గోవిందరావు, ఉపాధ్యక్షులు కె.నర్సింహులు, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వై.అశోక్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి..

- గంజాయి కొనుగోలు చేసి తరలిస్తున్న ఇద్దరి పట్టివేత
- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన



నిందితులు, గంజాయితో రైల్వే పోలీసులు

కాశిబుగ్గ: జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు యువకులు.. సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. దీనికి గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నారు. అనుకున్నదే తడవుగా ఏపీలోని శ్రీకాకుళంలో గంజాయిని కొనుగోలు చేసి దానిని ముంబై తరలించడానికి వరంగల్ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. వీరిపై అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా రూ. 5, 20,000 విలువైన 26 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీనిని స్వాధీనం చేసుకుని బుధవారం సాయంత్రం ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన షేక్ షహీన్ ముంబైలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మహారాష్ట్ర వెస్ట్ ముంబైకు చెందిన మహమ్మద్ సర్వర్ హజ్రత్ అలీ అన్సారీ.. బార్బర్‌గా పని చేస్తున్నారు. స్నేహితులైన వీరు జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో శ్రీకాకుళంలో 26 కిలోల ఎండు గంజాయిని కోనుగోలు చేశారు. దీనిని బ్యాగులలో తీసుకుని ముంబై వెళ్లడానికి వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ముంబై రైలు కోసం స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫామ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వీరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీ చేశారు. దీంతో గంజాయి లభించగా వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఇద్దరిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని జీఆర్పీ సీఐ తెలిపారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టండి

- ప్రణాళిక మేరకు విస్తృతంగా పంపిణీ చేయాలి
- నర్సరీలను సందర్శించిన కమిషనర్

సాక్షి ఎఫెక్ట్..

వరంగల్ అర్బన్: మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా పెంపకంపై సీరియస్‌గా దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం 'నిర్లక్ష్యం వీడితేనే హరితం!' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన బల్దియా కమిషనర్, ఉద్యానవన విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి మడికొండ, వడ్డేపల్లి సూర్య కుటీర్‌తోపాటు మరో ఐదు నర్సరీ కేంద్రాల్లో తనిఖీ చేసి పలు సూచనలిచ్చారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు? ఎన్ని మొక్కలు ఉన్నాయి? అని సీహెచ్‌ఓను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తక్కువ సమయంలో ఎక్కువ వేగంగా ఎదిగే మొక్కలను పెంచాలని, సూర్య కుటీర్ ప్రాంతంలోని నర్సరీకి ప్రహరీ నిర్మించాలని, జీవామృతం తయారీపై ఫారెస్ట్ శాఖ సహకారంతో సిబ్బందికి శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతీ ఇంటిలో మొక్కలు పంపిణీ చేసి, పెంచేలా ప్రోత్సహించాలని సూచించారు. నర్సరీలో పెంచిన మొక్కలను సంరక్షించాలని, వచ్చే ఏడాది నిర్వహించనున్న హరితహారం కార్యక్రమానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఆదేశించారు. బల్దియా అవసరాల నిమిత్తం పట్టణ ప్రగతి, అవెన్యూ, మీడియన్ అవసరాల కోసం మొక్కలు పెంచేలా చూడాలని కమిషనర్ సూచించారు.



మడికొండలోని నర్సరీని తనిఖీ చేస్తున్న కమిషనర్

భవన నిర్మాణ అనుమతుల పరిశీలన

హనుమకొండ నయీంనగర్, తెలంగాణ చౌరస్తా, ప్రశాంత్‌నగర్, హంటర్‌రోడ్డులోని పలు భవన నిర్మాణాలకు సంబంధించిన దరకాస్తులు, ప్లాన్‌లను కమిషనర్ తనిఖీ చేశారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ సిటీ ప్లానర్ ప్రకాశ్‌రెడ్డి, సీహెచ్ఓ శ్రీనివాసరావు, సీఎంహెచ్ఓ రాజేశ్, టీపీఎస్ సుమన తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల పరిష్కారాన్ని చాలెంజ్‌గా తీసుకోవాలి

చాలెంజ్‌గా తీసుకుని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్ని పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నందున ఏజెన్సీ ఎక్కువ మంది సహాయకులను నియమించుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, జోనా తదితరులు పాల్గొన్నారు.

పరువునష్టం కేసులో కోర్టుకు చీఫ్‌విప్



కోర్టుకు హాజరవుతున్న ప్రభుత్వ చీఫ్ విప్

వరంగల్ లీగల్: చైతన్య విద్యాసంస్థల అధినేత పురుషోత్తంరెడ్డిపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ప్రభుత్వ చీఫ్‌విప్, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం హనుమకొండ మొద టి అదనపు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. సాక్ష్యం ఇవ్వడానికి వచ్చిన వినయ్‌భాస్కర్.. చీఫ్ అఫిడవి ట్ (తన సాక్ష్యాన్ని లిఖితపూర్వకంగా కోర్టుకు సమర్పించడం) దాఖలు చేశారు. ప్రతివాది న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణ నిమిత్తం జడ్జి జయలక్ష్మి కేసును ఈనెల 26కి వాయిదా వేశారు.

కేసు పూర్వపరాలు ఇలా..

2016లో భారీగా వర్షాలు కురవడంతో డ్రెయినేజీలు నిండి మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రజ లు నిరసన తెలిపారు. దీనిపై నాటి బల్దియా కమిషనర్, జిల్లా పోలీస్ అధికారులు, మేయర్‌తోపాటు ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నయీంనగర్ నాలాపై అక్రమంగా నిర్మితమైన నిర్మాణాలు తొలగించాలని క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిర్ణయించారు. నాలాపై చైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల భవనాలు నిర్మించారని గుర్తించి వాటిని తొలగించారు. దీనిపై స్పందించిన చైతన్య విద్యాసంస్థల అధినేత పురుషోత్తంరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ తనను డబ్బులు అడిగాడని, ఇవ్వనందుకే కక్ష సాధింపుగా తమ విద్యాసంస్థల భవనాలు కూలగొడుతున్నాడని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలతో తన ప్రతిష్టకు నష్టం కలగజేసినందుకు రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పురుషోత్తంరెడ్డిపై ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు వచ్చారు.

ఆగస్టులో బీసీ గర్జన సభ

- మాజీ ఎంపీ హనుమంతరావు



విలేకరులతో మాట్లాడుతున్న హనుమంతరావు

హన్మకొండ చౌరస్తా: వచ్చే నెలలో లక్షలాది మందితో బీసీ గర్జన సభను నిర్వహిస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీసీ డిక్లరేషన్ సభపై జిల్లా ముఖ్య నాయకులు, ఓబీసీ జిల్లా కార్యవర్గంతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ బీసీ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరవుతారని తెలిపారు. పీసీసీ చీఫ్ రేవంత్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆదేశాలతో తెలంగాణలోని అన్ని జిల్లాలు తిరిగి బీసీలను ఏకం చేసి భారీస్థాయిలో బీసీ గర్జన విజయవంతం చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, ఈవీ శ్రీనివాసరావు, బొమ్మతి విక్రమ్, బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మోడల్ మార్కెట్ ఫీజు

- ఆందోళనలో టమాట వ్యాపారులు
- తగ్గించాలని వినతి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం మోడల్ మార్కెట్ ఫీజు పెంపుతో టమాట వ్యాపారుల లబోదిబోమంటున్నారు. ఈనెల11వ తేదీ న 'ధర పెరిగినా...ఫీజు అంతే' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంతో అధికారులు మార్కెట్ ఫీజు పెంపుపై దృష్టి సారించారు. దీంతో గురువారం టమాట బాక్సుల కొనుగోలు ధర ప్రకారం మార్కెట్ ఫీజు నిర్ణయించారు. దీంతో గతం కంటే ఒకే సారి నాలుగురెట్లు ఫీజు పెరి గింది. ధర పెంపును భరించలేని కొందరు వ్యాపారులు మా ర్కెట్ కార్యదర్శి రాహుల్ ఎదుట వాపోయినట్లు తెలిసింది. టమాట కొనుగోలు ధర భారీగా పెరగడంతో అమ్మకాలు పడిపోయాయని, ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన ధరకు అమ్మలేక రోజూ నష్టాల బారిన పడుతున్నామని తమ బాధలు ఏకరువు పెట్టినట్లు తెలిసింది. వర్షాభావ పరిస్థితులతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా టమాట ధర పెరిగిన నేపథ్యంలో ఆ ప్రకారమే ఫీజు వసూలు చేస్తున్నామని, ధర తగ్గితే ఫీజు తగ్గుతుందని మార్కెట్ కార్యదర్శి రాహుల్.. వ్యాపారులతో అన్నట్లు తెలిసింది. దీంతో ఏమి చేయలేక వ్యాపారులు వెనుతిరిగి వచ్చినట్లు సమాచారం. కాగా, ఇతర మార్కెట్‌లో కొనుగోలు చేసి తీసుకువస్తున్న నేపథ్యంలో మార్కెట్ ఫీజులో రాయితీ కల్పించాలని టమాట వ్యాపారులు మార్కెట్ కమిటీతో పాటు మార్కెటింగ్ అధికారులను కోరుతున్నారు.

బలహీన వర్గాల సంక్షేమానికి మోదీ కృషి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తున్న పద్మ

హన్మకొండ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. మహాజన సంపర్క్ యోజనలో భాగంగా హనుమకొండ సమ్మయ్యనగర్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రావు పద్మ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 9 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బీజేపీ 57వ డివిజన్ అధ్యక్షుడు మధుచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సదానందంగౌడ్, సారంగపాణి, దేవేందర్‌రెడ్డి, మౌనిక యాదవ్, శివ కళ్యాణ్, కొత్తపెల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

యువర్స్

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

● యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



● సక్సెస్ స్టోరీ


తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్

స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

● టెక్.. టాక్



హువావే నోవా 11 ప్రో

● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హామని ఓఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్నాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేఔట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్నా వాకౌట్


పూజా హెగ్డే
రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగ వంశీతో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


కత్రినా కైఫ్


ప్రియాంకా చోప్రా


ఆలియా భట్


అనుష్కా శర్మ


కియారా అద్వానీ


మీనాక్షీ చౌదరి
శ్రీలీల


'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ


విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ


అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.


మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయూర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.


సయ్యద్ సోహైల్, రూపా కొడవాయూర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ-''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.